# హతోస్మి

సూరేపల్లి విజయ



పాలసముద్రంలో విష్ణుమూర్తి శేష పాన్పు మీద విశ్రాంతి తీసుకుంటున్నాడు. అప్పటికే అన్ని అవతారాలు పూర్తిచేసాడు. కంటిమీద కునుకు లేదు. యికనైనా, రవ్వంతయినా విశ్రాంతి తీసుకోవాలని అనుకున్నట్టు కళ్ళు మూసుకున్నాడు.

శ్రీమహాలక్ష్మి యాజిటీజ్‌గా భర్త పాదాలు పడుతూ వుంది. అప్పుడప్పుడు భర్తను పలకరించాలని వుంది. కాసింత అలకగా వుంది. ఎప్పుడూ హడావిడిగా అవతారాలు ఎత్తడం తనని తీసుకెళ్ళడం, అవతార సమాప్తి వరకూ దుష్టశిక్షణ... రవ్వంతయినా మనశ్శాంతి లేదు.

అప్పుడప్పుడు ఆమె చూపు భూలోకమ్మీద పడుతూనేవుంది. భక్తులు, గుళ్ళు, విన్నపాలు, వేడికోళ్లు. మొక్కులు...అన్నీ చూస్తూనే వుంది.

అన్ని అవతారాలు తన భర్తవే... వివిధ రూపాల్లో వున్న కృష్ణుడిని, రాముడిని, యిలా దేవతలను విడదీసి, భక్తులు పూజలు చేస్తూ మొక్కులు మొక్కేసుకుంటూనే వున్నారు.

శ్రీవారు నిద్రావస్థలో వున్నారు. అది జగన్నాటకమని ఆ దేవేరికి తెలియదు. శ్రీమహాలక్ష్మి కాసింత ఆసక్తిగా భూలోకంవైపు చూసింది.

** ** **

భూలోకం...

భారద్దేశం...

వామనమూర్తి నిద్రలేచాడు. కళ్ళు నలుముకొని ఓసారి ఎదురుగా గోడమీద వున్న దేవుడి క్యాలెండర్ వైపు చూసి లెంపలు వేసుకున్నాడు.

వామనమూర్తి భార్య దభాలున పూజగదిలో నుంచి వచ్చి భర్త పాదాలను ముందుకు లాగి, ఆ పాదాలకు దణ్ణం పెట్టుకుంది. వామనమూర్తి ఒక్క క్షణం కంగారుపడిపోయి. అంతలోనే అది అలవాటైన వ్యవహారం కనుక, సర్దుకుపోయి 'దీర్ఘసుమంగళీ భవ' అని ఆశీర్వదించాడు తన సేఫ్‌సైడ్ కోసం.

వామనమూర్తి భార్య రెండు కళ్ళు మూసుకొని లెంపలు వేసుకొని. పూజగదిలోకి వెళ్ళి దేవుడికి దండం పెట్టుకుంది. వచ్చే జన్మలోనైనా, సినిమా హీరోకి భార్యనయ్యేలా చేయి స్వామీ... నీకు వారానికో కొబ్బరికాయ కొడతాను అని మొక్కుకుంది.

వామనమూర్తి భార్యకు చిన్నప్పట్నుంచి సినిమా హీరోల మీద గొప్ప వర్షిప్. అదలా కంటిన్యూ అయింది. పదేళ్ళ వయసులో తను అప్పటికే అమితాబ్‌ని ప్రేమించేస్తున్నానని డిక్లేర్ చేసింది.

పదహారేళ్ళ వయసులో, ఆ సినిమా హీరో చంద్రమోహన్‌ని తప్ప మరో వ్యక్తిని పెళ్ళి చేసుకోనని భీష్మించుక్కూచుంది. ఆఖరికి చంద్రమోహన్ నాకన్నా హైట్ తక్కువ. మరో హీరోని చూద్దామంటే వూర్కుంది. అప్పటికే ఆమె తండ్రి తనకు తెలిసిన యిద్దరి ముగ్గురి ద్వారా సినిమాల్లో చిన్నచిన్న వేషాలు వేసేవాళ్ళను తన అల్లుడిగా చేసుకోవాలని ట్రై చేసాడు. కానీ, ఆ చిన్నచిన్న వేషాల వాళ్ళు ఓ కండిషన్ పెట్టారు.

నాకు కట్నం డబ్బుగా ఓ సినిమా తీయాలని, అందులో తానే హీరోనని చెప్పాడు. దాంతో ఆ ప్రయత్నం మూలబడిపోయింది. ఈలోగా ఆ అమ్మాయి వయసు పెరిగి తెల్లవెంట్రుకలు అక్కడక్కడ వచ్చేసరికి, వామనమూర్తి కిచ్చి పెళ్ళి చేసేరు.

రాబోయే చిత్రంలో కాబోయే హీరో అన్జెప్పి కూతుర్ని కన్విన్స్ చేసాడు. తర్వాత అసలు విషయం తెలిసి కనీసం వచ్చే జన్మలో అయినా సినిమా హీరో భర్తగా దొరికేలా చూడమని దేవుడ్ని, ఇటు పతి దేవుడ్ని వేడుకోవడం మొదలెట్టింది వామనమూర్తి భార్య!

** ** **

వామనమూర్తి కాంట్రాక్టర్.

శుచిగా తయారై, దేవుడి ముందు మోకరిల్లి "స్వామీ... ఆ రోడ్డు కంట్రాక్టు నాకే దొరికేలా చూడు... నీకు పది కాసుల బంగారం సమర్పించుకుంటాను అదీ నీ కొండకి వచ్చి... అందాక అడ్వాన్స్‌గా యిది వుంచండి" అంటూ చిన్న పిసరంత బంగారం దేవుడి హుండీలో వేసాడు. ఆ తర్వాత ఓ కొబ్బరికాయ ఫట్‌మని కొట్టాడు.

పూజయ్యేక భార్యతో చెప్పాడు ఈ కొబ్బరి ముక్కలతో చెట్నీ చేయమంటూ.

అదే సమయంలో, అతని పోటీ కాంట్రాక్టర్ కూడా దేవుడికి రెండు తులాల గొలుసు వేస్తానని నూటొక్క కొబ్బరికాయలు కొడతానని మొక్కుకొని. అడ్వాన్స్‌గా ఓ అయిదు కొబ్బరికాయలు కొట్టాడు.

** ** **

శ్రీ వెంకటేశ్వరస్వామి గుడి రద్దీగా వుంది.

కొంతమంది విద్యార్థులు క్యూ కట్టి, దేవుడి దర్శనం చేసుకొని, తలా ఒక కొబ్బరికాయ కొట్టి, తమని పరీక్షలో పాస్ చేయించమని. అలా పాసయితే మరో అయిదు కొబ్బరికాయలు కొడతామని మొక్కుకుంటున్నారు.

పూజారి వాళ్ళకు ఓ చిప్ప వుంచి, మరో చిప్ప దేవుడి దగ్గర పెట్టసాగాడు. గుడి మూసే వేళకు ఆ కొబ్బరి చిప్పలు... ఏ అయ్యర్ హోటల్‌కో తరలి వెళ్తాయి. పూజారి దేవుడి ముందు నిలబడి లెంపలు వేసుకొని తన తప్పు కాయమంటాడు.

** ** **

అదో పాముల పుట్ట.

ఆడవాళ్ళంతా గుంపులు గుంపులుగా వస్తున్నారు. పుట్టలో నుంచి పాము ఒకటి బయటకు వచ్చింది. వెండిగిన్నెల్లో తెచ్చిన పాలు ఆ పాము ముందు

పెడితే... పాము ఆ పాలు తాగుతోంది(?)

(పాములు పాలు తాగవన్న సంగతి వేరే)

నాకు పెళ్ళయితే...నీ పుట్టలో కాసుల పేరు జారవిడుస్తానని ఓ అమ్మాయి మొక్కుకుంది.

నా మొగుడు మందు మానితే, వెండి పాము చేయిస్తానని మరో భక్తురాలి విన్నపం.

ఇలా ఎవరికి వారు మొక్కులు మొక్కుకుంటూనే వున్నారు.

** ** **

ఓ గజదొంగ ఆలయంలోకి వచ్చాడు.

రాత్రివేళ... సెక్యూర్టీ గార్డుని గాయపరిచి, స్పృహ తప్పేలా కొట్టి, దేవుడి నగలు దోచుకొని, దోచుకున్న ఆ నగలలో నుంచి ఓ గొలుసు తీసి దేవుడి హుండీలో వేసి... 'నా తప్పును క్షమించు దేవుడా...' అని వేడుకున్నాడు. అంతేకాదు తనని పోలీసులు పట్టుకోకుండా వుంటే దోచుకున్న ఈ బంగారంలో సగం, యిదే ఆలయంలోని హుండీలో వేస్తానని కూడా మొక్కుకున్నాడు.

** ** **

ఓ గృహిణి దేవుడి ప్రసాదాన్ని దేవుడి ముందు పెట్టి పూజ చేసి గంటకొట్టి తిరిగి ఆ ప్రసాదాన్ని మరో గిన్నెలోకి మార్చి తను తినేసింది.

** ** **

శ్రీమహాలక్ష్మి ఆత్రం ఆపుకోలేక భర్తను నిద్రలేపి, "చూసారా... మీరన్నా, దేవుళ్ళన్నా ఆ భక్తులకు ఎంత భక్తో" అంది.

శ్రీ మహావిష్ణువు చిర్నవ్వు నవ్వి "అది భక్తికాదు. ఓ రాయివేసి చూస్తున్నారు. కానీ ఖర్చు లేకుండా ఆయాచితంగా లాభాన్ని ఆశిస్తున్నారు" అన్నాడు.

"అదేంకాదు... మీరంటే భక్తి కాబట్టే మీకు కొబ్బరికాయలు కొడుతున్నారు. కానుకలు సమర్పించుకుంటున్నారు"

"ఆ కానుకలు నేను నిజంగా స్వీకరించిన క్షణం, వాళ్ళ కోరికలు నెరవేరవు అని తెలిసిన మరుక్షణం వాళ్ళలో ఈ భక్తి వుండదు. కానుకలు సమర్పించాలనే భక్తి భావమూ వుండదు" మహావిష్ణువు స్థిరంగా చెప్పాడు.

"నేన్నమ్మను" మహాలక్ష్మి అంది.

"సరే... అయితే ఆలకించు... తిలకించు" అంటూ మళ్ళీ కళ్ళు మూసుకున్నాడు.

** ** **

వామనమూర్తి రోజులానే దేవుడికి దండం పెట్టి కొబ్బరికాయ కొట్టి కళ్ళు మూసుకున్నాడు. తర్వాత కళ్ళు తెరిచి చూస్తే కొబ్బరికాయ (రెండు ముక్కలు) కనిపించలేదు. హుండీలో వేసిన పిసరంత బంగారమూ కనిపించలేదు.

తెగ కంగారు పడిపోయాడు కంట్రాక్టు రాలేదు.

** ** **

దేశమంతా గగ్గోలు.


దేవుడికి నైవేద్యంగా పెట్టిన ప్రసాదాలు కళ్ళు మూసుకున్న మరుక్షణమే మాయమవుతున్నాయి. దేవుడికి మొక్కులు మొక్కుకుంటే, ఆ మొక్కులు మాయమవుతున్నాయి. దేవుడికి సమర్పించే కానుకలు అదృశ్యమవుతున్నాయి. చివరికి దేవుడికి కొట్టిన కొబ్బరికాయలు కూడా మాయమవుతున్నాయి.

ఇదంతా ఏదో ఉపద్రవం అని కొందరు, కాదు దైవలీల అని కొందరు... ఆస్తికులు... నాస్తికులు... అటు, యిటూ కాకుండా గోడమీది పిల్లిలా అవసరానికి అనుగుణంగా నడుచుకునే వాళ్ళు కథలు కథలుగా చెప్పుకుంటున్నారు.

** ** **

రోజులు, నెలలు గడిచాయి.

ఇప్పుడు దేవుడికి మొక్కులు మొక్కుకునే వాళ్ళు కరువయ్యారు. కొబ్బరికాయలు కొట్ట



**వామనమూర్తి కాంట్రాక్టర్. శుచిగా తయారై, దేవుడి ముందు మోకరిల్లి "స్వామీ... ఆ రోడ్డు కంట్రాక్టు నాకే దొరికేలా చూడు... నీకు పది కాసుల బంగారం సమర్పించుకుంటాను అదీ నీ కొండకి వచ్చి... అందాక అడ్వాన్స్‌గా యిది వుంచండి" అంటూ చిన్న పిసరంత బంగారం దేవుడి హుండీలో వేసాడు. ఆ తర్వాత ఓ కొబ్బరికాయ ఫట్‌మని కొట్టాడు.**

డంలేదు. మామూలుగా అయితే కొబ్బరికాయలు కొట్టి, ఆ కొబ్బరితో చట్నీ చేసుకునేవాళ్ళు, మిగతా ముక్కతో పూజారి హోటల్‌లో అమ్మి వ్యాపారం చేసుకునేవాడు.

దేవుడి ముందు నైవేద్యంపెట్టి, తిరిగి దాన్ని తమ కోసమే వుపయోగించుకునే భక్తులు, ఆ నైవేద్యం, తాము సమర్పించే కానుకలు, తమకిక వుండవని తెలియడంతో పునరాలోచనలో పడ్డారు.

చివరాఖరికి దేవుడికి మొక్కుకునేవాళ్ళు, నైవేద్యాలు, కానుకలు సమర్పించేవాళ్ళు కాగడా వేసి వెతికినా కనిపించని స్థితికి వచ్చింది.

** ** **

"ఇదెక్కడి చోద్యం స్వామీ... భక్తుల్లో భక్తి భావం తగ్గిపోయిందా? దేవుడంటే నమ్మకం సన్నగిల్లిందా?" మహాలక్ష్మి కలతపడి అడిగింది.

"భక్తి భావం అవసరంతో ముడిపడే 'దేవుడనే' నమ్మకంయిది. తమ తప్పులను కాయమని, తమకు ప్రతిఫలం అందేలా చూడమని, తమకు లాభం కలగాలని మాత్రమే దేవుడ్ని వేడుకుంటున్నారు.

భక్తులు తమ అవసరానికి, స్వార్థానికి కోరుకునే కోరికలు తీరిస్తే ఈ సృష్టికి అర్థముండదు. లలాట లిఖితానికి పరమార్థం వుండదు.

నిజమైన భక్తులు, మనసులో దేవుడ్ని స్మరించినా చాలు. వాళ్ళకు కానుకలతో మొక్కులతో సంబంధం లేదు. నాకు వాళ్ళు సమర్పించే నైవేద్యం, కానుకలు క్షణకాల సంతృప్తి కోసం మాత్రమే. నిజంగానే కానుకలను స్వీకరించిన మరుక్షణం వాళ్ళలో ఆలోచన...భక్తి- ముక్తి అనికాకుండా, లాభమూ-యిచ్చి పుచ్చుకోవడాలు"

"అంటే- ఈ భక్తులకు నిజంగా మీ యెడల విశ్వాసం, భక్తి లేవంటారా?"

"అందరూ అలా కాదు. నా యెడల భక్తీ, విశ్వాసం వున్న భక్తులు ఈ కానుకలు, నైవేద్యాలు సమర్పించవలసిన అవసరం లేదు. వాళ్ళ కోరికలతో నా వద్దకు విన్నపాలు తీసుకురారు. ఆత్మశుద్ధి కోసం మోక్షం కోసం, ఆధ్యాత్మిక చింతన కోసం నన్ను ఆశ్రయిస్తారు. మనసులో నన్ను ప్రార్థిస్తారు. అలాంటి భక్తులు నన్ను పూజించవలసిన పనిలేదు. వాళ్ళలోనే వాళ్ళు దేవుడ్ని దర్శించగలరు.

వాళ్ళ పవిత్రమైన ఆశయమే వాళ్ళ దైవం. కృషిని నమ్ముకున్న వాళ్ళు, పట్టుదల, దీక్షాదక్షతలు వున్న వాళ్ళకు ఈ దేవుడి అవసరం వుండదు. మానవుడిగా జన్మించినందుకు, ఆ జన్మను సార్థకం చేసుకుంటే చాలు. దేవుడు అనేది మానసికమైన ప్రశాంతత కలిగించే భావమే కావాలి.

వృత్తిలో తాము ప్రేమించేవారి మంచి మనసులో, తాము చేసే పనిలో దైవాన్ని దర్శించినవాడు, నన్ను దర్శించినట్టే... ఈ సత్యాన్ని మనుషులు గుర్తించిన రోజున దేవుడికి ఒకే రూపం వుంటుంది. ఆ రూపమే అంతరాత్మ" శ్రీమహావిష్ణువు విశ్వ రహస్యాన్ని విశదీకరించారు.

శ్రీమహాలక్ష్మి విష్ణుమాయలోని మర్మాన్ని అవగతం చేసుకునే ప్రయత్నం చేస్తోంది.

దేవుడ్ని తమ కోరికలు తీర్చే కల్పతరువుగాకాక, మానసిక ప్రశాంతత కోసం, ముక్తిమార్గం కోసం స్మరించుకునే రోజు వస్తుందా?